క్లుప్తంగా

30 మంది రక్తదానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రాజప్ప తదితరులు

సామర్లకోట: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 30 మంది మాత్రమే రక్తదానం చేశారు. గురువారం స్థానిక రైతు భవనంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం వల్ల అనేక మంది ప్రాణాలను రక్షించే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్త దానం చేయడం వల్ల మంచి ఆరోగ్యం కలుగుతుందని చెప్పారు. ప్రజల కోసం ఆలోచించి రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా రక్తం సేకరించి అవసరమైన వారికి అందే ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. రెడ్ క్రాస్ సంస్థ వైద్యుడు ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో కొడా చైర్మన్ తుమ్మల బాబు, తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, ఎంపీడీఓ కె.హిమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పదవీ విరమణ వయసు పెంచాలి



పారిశుధ్య కార్మికుల సమస్యలపై వినతి పత్రం అందజేసిన ఏఐటీయూసీ నాయకులు

సామర్లకోట: మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల సమస్యలపై ధర్నా చేసి మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల మురళి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు పదవీ విరమణ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. ఇప్పటికే అనేక మంది కార్మికులు 60 ఏళ్లకే పదవీ విరమణ చేశారన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేసి వారికి రావలసిన అన్ని సదుపాయాలు అందేలా చేయాలన్నారు. కార్మికుల ఉద్యమానికి సీపీఐ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పెదిరెడ్ల సత్యనారాయణ, కామిరెడ్డి బోడకొండ, మున్సిపల్ యూనియన్ నాయకులు బొత్స శ్రీను, మల్లిపూడి లక్ష్మి, మిరియా పెద్ద, చెన్నా వెంకటేశ్వర్లు, బంగారు వెంకన్న, తాతపూడి శ్రీనివాసరావు, గూడుపు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

కాకినాడ క్రైం: కాకినాడ ఉత్తర ఎక్సైజ్ శాఖ నిర్వహించిన దాడుల్లో నాటుసారాను స్వాధీనం చేసుకొని 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సామర్లకోట–పిఠాపురం రోడ్డులో గురువారం ఈ దాడులు నిర్వహించామని ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకుని కోర్టులో ప్రవేశపెట్టామని ప్రకటనలో పేర్కొన్నారు.

నాచు నీటిని తాగేదెలా?

- ఫిల్టర్ చెరువు నిర్వహణ అధ్వానం
- పాతనీరు, పూడిక తీయకుండానే గోదావరి కలుషిత నీటి సరఫరా
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు
- సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్



నాచునీటితో ఉన్న నాగార్జున ఫిల్టర్ చెరువు

సామర్లకోట: వేసవి ప్రారంభం నుంచే అనేక ప్రాంతాల్లో నీటి ఎద్దడి సమస్యతో ప్రజలు గగోలు పెడుతున్నారు. పట్టణ ప్రజలకు తాగునీరు అందజేయడానికి ఉండూరు రైల్వే గేటు వద్ద ఉన్న నాగార్జున ఫిల్టర్ చెరువులో నీటిని శుద్ధి చేయడానికి ఫిల్టర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. చెరువులో నీటిని కొన్ని నెలలుగా వాడకపోవడం వల్ల అందులోని నీరు ఆకు పచ్చగా మారిపోయింది. ఈ విషయాన్ని కలెక్టరు దృష్టికి తీసుకు వెళ్లడంతో చెరువులో చేపలు పట్టించి నీటిని పూర్తిగా తీసి కొత్త నీటిని నింపాలని ఆయన మున్సిపల్ అధికారులకు సూచించారు. దాంతో చెరువులో నీటిని తొలగించే ప్రక్రియను ప్రారంభించి గోదావరి జలాలు నింపే ప్రక్రియ ప్రారంభించారు. అయితే చెరువులో నీటిని పూర్తిగా తొలగించకుండా గోదావరి జలాలతో నింపడం వల్ల నాగార్జున ఫిల్టరు చెరువులో నీరు ఆకు పచ్చ రంగులోనే ఉంది. అనేక ప్రాంతాలలో కేవలం ఒక గంట మాత్రమే తాగునీరు ఇవ్వడం వలన నీటి ఎద్దడి ప్రారంభం అయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రం సమీపంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని ఆ ప్రాంత మహిళలు వాపోతున్నారు. ఇప్పుడే ఇలా అయితే మే నెలలో పరిస్థితి ఏమిటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పూడిక తీయించే అవకాశాన్ని వదిలేశారు

నాగార్జున చెరువులోని నీటిని తీస్తున్నపుడే చెరువులో పూడిక తీసి వేత ప్రారంభిస్తే చెరువులో నీటి నిల్వలు పెరిగే అవకాశం ఉండేది. అటువంటి అవకాశాన్ని మున్సిపల్ అధికారులు సద్వినియోగం చేసుకోలేదు. సుమారు 45 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన చెరువులోకి గోదావరి కాలువ నీటితో పాటు మట్టి చేరింది. చెరువులో మూడు మీటర్ల నీరు నిల్వ చేసే అవకాశం ఉంది. అయితే ఒకటిన్నర మీటర్ల వరకు పూడిక ఉన్నదని అధికారులే అంగీకరిస్తున్నారు. చెరువును పూర్తిగా నింపినా మీటరున్నర మాత్రమే నీరు నిల్వ ఉండే అవకాశం ఉంది. మరో వారం రోజులలో గోదావరి కాలువను కట్టేసే అవకాశం ఉంది. దాంతో వేసవి కాలంలో నీటి ఎద్దడి ఏ విధంగా ఎదుర్కొంటారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

గోదావరి కాలువలో కలుషిత జలాలు

గోదావరి కాలువలో ఇటీవల కాలంలో కలుషిత జలాలు పెరిగి పోయాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు ప్రస్తుతం గోదావరి కాలువ నలుపు రంగులోనికి మారిపోయింది. పెద్దాపురం ఏడీబీ రోడ్డు సమీపంలో ఉన్న పరిశ్రమల నుంచి వ్యర్థ జలాలు వేట్లపాలెం మీదుగా గోదావరి కాలువలోనికి కలుస్తున్నాయని స్థానికులు అంటున్నారు. గోదావరి కాలువ లో నీటి మట్టం తగ్గిపోయిన సమయంలో నీరు మరింత నల్లగా ఉంటుంది. గోదావరి కలుషిత జలాలపై అధికారులు స్పందించడం లేదనే ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.



నలుపు రంగులో సామర్లకోట గోదావరి కాలువ నీరు



చెరువు నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ డీఈ, పబ్లిక్ హెల్త్ అధికారులు

కాలుష్యాన్ని నివారించాలి



సామర్లకోట గోదావరి కాలువలోకి కలుషిత జలాలను విడిచి పెడుతున్నా అధికారులు స్పందించడం లేదు. ఫిల్టరు చెరువులో నీటి నిల్వలకు సంబంధించి కలెక్టరుకు ఫిర్యాదు చేశాం. అందులో నీటిని పూర్తిగా తొలగించకుండానే మళ్లీ నీటిని నింపారు. దాంతో నీరు నాచు రంగులోనే ఉంది. అంతకు మునుపు నాచుబారిందనే గోదావరి కాలువలో నీటిని నేరుగా ఫిల్టరు ప్లాంటులోనికి పంపి శుద్ధి చేసే వారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి.

– నేతల హరిబాబు, కౌన్సిలర్, సామర్లకోట

ఫిల్టర్ చెరువును పూర్తిగా నింపాం



పట్టణ ప్రజలకు తాగునీరు అందించే నాగార్జున ఫిల్టరు చెరువును పూర్తి నింపాము. చెరువు సామర్థ్యం మూడు మీటర్లు ఉంది. అయితే మీటరున్నర వరకు మట్టి ఉన్న మాట నిజమే. చెరువుపై హక్కు ప్రజారోగ్య విభాగం అధికారులకు ఉంది. వారితో కలిసి చెరువును పరిశీలించాం. గోదావరి కాలువ కలుషితం అవుతుంది. గతంలో గోదావరి కాలువ వెంబడి ఎక్కువగా గ్రామాలు ఉండేవి కాదు. పట్టణంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకొంటున్నాం.

– కె.శశిధర్, మున్సిపల్ డీఈ, సామర్లకోట.

ఉత్సాహంగా దొరబాబు జన్మదిన వేడుక



దొరబాబును సత్కరిస్తున్న అభిమానులు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డిటర్, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దవులూరి దొరబాబు జన్మదిన వేడుకలు ఆయన అభిమానుల మధ్య గురువారం చేసుకున్నారు. స్థానిక స్వగృహంతో భార్య చంద్రకళ, తండ్రి దవులూరి సుబ్బారావు లతో కలిసి వేడుక చేసుకున్నారు. నియోజకవర్గం నుంచి వచ్చిన అభిమానులు పార్టీ నాయకులు హాజరయ్యారు. సర్వమత ప్రార్థనలు చేసి మతగురువులు ఆయనను ఆశీర్వదించారు. అభిమానుల మధ్య భారీ కేక్ కట్ చేసి పంచడంతో పాటు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యరక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, జి. సునేత్రాదేవి, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు తదితర నేతలు పాల్గొని దొరబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

19న రన్ ఫర్ జీసస్

సామర్లకోట: ఏసు క్రీస్తు సమాధి నుంచి లేచి ఉన్న శుభవార్తను తెలియజేయడానికి ఈనెల 19వ తేదిన రన్ ఫర్ జీసస్ నిర్వహించనున్నట్లు మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.బ్లెసింగ్, కార్యదర్శి కె.జయబాబు తెలిపారు. గురువారం సాయంత్రం వారు విలేకర్లతో మాట్లాడుతూ శనివారం ఉదయం స్థానిక సీబీఎం హైస్కూల్ నుంచి బ్రౌన్‌పేట, పాత తహసీల్దార్ కార్యాలయం, బళ్లమార్కెట్ సెంటర్, గాంధీచౌక్ నుంచి గడియారం స్తంభానికి చేరుకుని ప్రతిజ్ఞ చేస్తారన్నారు. కార్యక్రమంలో క్రైస్తవ నాయకులు, విశ్వాసులు, పెద్దలు, యూత్, మహిళలు హాజరు కావా లన్నారు.

పిల్లలు బడిలోనే ఉండాలి

- ఎంఈఓ శివరామకృష్ణయ్య
- వేట్లపాలెంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్



వేట్లపాలెంలో మాట్లాడుతున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెం గ్రామంలో జిల్లా పరిషత్తు హైస్కూల్ ఆధ్వర్యంలో గురువారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శివరామకృష్ణయ్య మాట్లాడుతూ పిల్లలు బడి బయట ఉండడానికి వీలు లేదని, ఈ మేరకు ఉపాధ్యాయులు, విద్యాశాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన అన్నారు. గురువారం నిర్వహించిన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ర్యాలీలో 40 మందిని ఆరో తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో చేరడానికి గుర్తించినట్లు ఎంఈఓ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యతో పాటు అనేక మౌలిక వసతులు, విశాలమైన క్రీడా మైదానాలు ఉన్నాయన్నారు. ప్రతి విద్యార్థికి మూడు జతల యూనిఫాం, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలతో పాటు బ్యాగ్, షూ ఉచితంగా ఇస్తారన్నారు. అలాగే ఒకటో తరగతి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తల్లికి వందనంలో రూ.15 వేలు తల్లి ఖాతాలో జమ అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 పి.పుల్లయ్య, సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్, హైస్కూల్ హెచ్ఎం పి.అనురాధ, విద్యాకమిటీ చైర్మన్ పీతల నాగశివ తదితరులు పాల్గొన్నారు.

గుడ్ ఫ్రైడేకు ఏర్పాట్లు

పిఠాపురం: క్రైస్తవుల పండగ గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని గురువారం ఏర్పాట్లు చేసారు. నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రామాల్లోను క్రైస్తవ మరుభూములలో ఉన్న తమ వారి సమాధులను శుభ్రం చేశారు. సమాధులను వివిధ రకాల పూలతో అలంకరించి శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.



గొల్లప్రోలులో మరు భూమిని శుభ్రం చేస్తున్న క్రైస్తవులు

మున్సిపల్ ప్లాన్ల కోసం దరఖాస్తు చేసుకోండి

సామర్లకోట: మున్సిపల్ ఆదాయం పెంచుకునే క్రమంలో గతంలో గుర్తించిన ఇంటి నిర్మాణాలకు ప్లాన్లకు అనుమతి ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. ఈ మేరకు పట్టణంలో 4, 6, 22, 23 వార్డులను గుర్తించినట్లు తెలిపారు. గురువారం ఆయా వార్డులలో గతంలో దరఖాస్తు చేసుకోగా అనుమతి నిరాకరించిన నిర్మాణాల వివరాలను నోటీసు బోర్డులో ఏర్పాటు చేస్తున్నామని, వాటిపై అభ్యంతరాలు ఉంటే వారం రోజులో తెలియ జేయాలన్నారు. ఆయా లే అవుట్లలో మున్సిపాలిటీ నిబంధనల మేరకు ఉండాల్సిన రోడ్లు లేకపోయినా, మెయిన్ రోడ్డుకు దూరంగా మారుమూల ఉన్న ప్రాంతాలలో కనీసం 12 నుంచి 20 అడుగుల రోడ్లు ఉన్నప్పటికీ ప్లాన్లకు అనుమతి ఇవ్వనున్నట్లు కమిషనర్ తెలిపారు. అనధికార లే అవుట్లలో నిబంధనల ప్రకారం రోడ్లు లేకపోవడంతో మున్సిపాలిటీ ప్లాన్లు ఇవ్వడం లేదన్నారు. దాంతో స్థలాలను కొనుగోలు చేసిన వారు స్థలాలను ఖాళీగా వదిలేస్తున్నారని, దాంతో మున్సిపాలిటీ ఆదాయం కోల్పోతోందన్నారు. మున్సిపల్ ఆదాయం పెంచే క్రమంలో ఇరుకు రోడ్లు ఉన్న ప్రాంతాల్లో ప్లాన్లు ఇవ్వడానికి అనుమతి ఇస్తూ సర్క్యులేషన్ ప్యాట్రన్స్ జీఓను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అయితే ప్రధాన రోడ్లలో ఉన్న లే అవుట్‌లో మాత్రం నిబంధనల ప్రకారం రోడ్లు ఉండాలన్నారు. అవసరమైతే రోడ్డు వెడల్పు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి మంజుల, సచివాలయ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



సర్క్యులేషన్ ప్యాట్రన్స్ జాబితాను విడుదల చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు

మా ధాన్యం కొనండి మహాప్రభో!

- భోగాపురంలో అన్నదాతల ఆర్తనాదాలు
- ప్రైవేటు వ్యాపారులు దోచేస్తున్నారని ఆవేదన



భోగాపురంలో తమ ధాన్యం కొనాలంటూ వేడుకుంటున్న రైతులు

పిఠాపురం: తల, మొల తాకట్టు పెట్టి అప్పులు చేసి పంటలు పండించాం. సార్వాలో ఏలేరు వరదల వల్ల పంటలు పోయి అప్పుల పాలయ్యాం. ఇప్పుడు పంటను కొనే వారు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. మహా ప్రభో మా ధాన్యం కొనండి అంటు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోను ఇదే పరిస్థితి. ప్రభుత్వం కొనడం లేదు ప్రైయివేటు వ్యాపారులు 75 కేజీల బస్తా రూ.1200కు అడుగుతున్నారు. అలాగైనా ఇచ్చేద్దామంటే అరువు అంటున్నారు. ఎప్పుడు డబ్బులు ఇస్తారో చెప్పడం లేదంటూ భోగాపురానికి చెందిన పలువురు రైతులు గురువారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో బస్తా రూ.1800కు కొనేవారు. బళ్ల అద్దెలకు రూ.90 ఇచ్చేవారు. సొసైటీలో బోనస్‌గా మరో రూ.50 ఇచ్చేవారు. కాని ఇప్పుడు అసలు కొనే వారే లేరంటూ ఆందోళన వ్యక్తం చేశారు. అటు ప్రభుత్వం కొనక ఇటు ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకు కొని అరువు అడగుతుండడంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాక చాలా ఇబ్బందులు పడుతున్నామని తమను ఆదుకోవాలంటు చేతులు జోడించి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఆరుదల కోసం ధాన్యం ఆరబెట్టాలని చూస్తుంటే అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోయి ఉన్నదంతా నష్ట పోవాల్సిన పరిస్థితుల్లో అయోమయంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోసిన ధాన్యాన్ని ఇళ్లకు తీసుకు వెళ్లి ఇళ్లలో దాచుకోవాల్సిన పరిస్థితి ఎదురైందని ఇలా ఎప్పుడూ లేదంటున్నారు. ఒక పక్క అధికారులు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొంటున్నట్లు ప్రకటిస్తుండగా, ప్రతి గ్రామంలోను రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు



ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన కల్పిస్తున్న పాడా పీడీ చైత్ర వర్షిణి

పిఠాపురం: రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామని రైతులకు ఇబ్బంది లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పాడా పీడీ చైత్ర వర్షిణి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ విజయకుమార్, పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకురాలు పి.స్వాతి తదితరులు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ధాన్యం ఆరవేసిన రైతులను కలసి రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించాలని, దళారులకు తక్కువ ధరకు ఇవ్వవద్దని వారికి సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 8 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు 638 క్వింటాళ్ల ధాన్యాన్ని చేబ్రోలు రైతు సేవ కేంద్రం నుంచి కొనుగోలు చేసినట్లు వారు తెలిపారు. కొనుగోలు చేసిన 24 గంటల నుండి 36 గంటల లోపల ధాన్యం విక్రయించిన సొమ్ము రైతు బ్యాంక్ ఖాతాకు జమ అవుతుందన్నారు. 17 శాతం తేమ ఉన్న గ్రేడ్–ఏ రకానికి చెందిన ధాన్యానికి 75 కిలోల బస్తాకు రూ.1740, సాధారణ రకానికి 75 కేజీలు రూ.1725 చొప్పున కొనడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. దీనిని రైతులు ఉపయోగించుకుని నష్టాలు లేకుండా చూసుకోవాలని వారు సూచించారు. వీరి వెంట మండల తహసీల్దార్ సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి కేవీవీ సత్యనారాయణ, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు సేవ కేంద్రం సిబ్బంది, ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది ఉన్నారు.

సద్వినియోగం చేసుకోండి

కొత్తపల్లి: గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పాడా పీడీ చైత్ర వర్షిణి అన్నారు. మండలంలోని రమణక్కపేట, నాగులాపల్లి గ్రామాల్లో గురువారం వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించారు.

దళారుల దోపిడీ అరికట్టాలి

- పంటకు గిట్టుబాటు ధర కల్పించండి
- పులిమేరులో రైతు కూలీల ఆందోళన



ప్రత్తిపాడు–సామర్లకోట రహదారిలో బైఠాయించిన రైతుకూలీలు

పెద్దాపురం: వరి రైతుకు గిట్టుబాట ధర కల్పించి దళారుల దోపిడీని అరికట్టాలని ఏపీ రైతుకూలీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్లూరి రాజుబాబు, బి.రమేష్ డిమాండ్ చేశారు. మండలంలోని పులిమేరు గ్రామంలో గురువారం రైతులకు మద్దతుగా ప్రత్తిపాడు–సామర్లకోట రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్బీకేలలో సత్వరమే సీఎంఆర్ ఓపెన్ చేసి దళారి వ్యవస్థను కట్టడి చేయాలన్నారు. జిల్లా అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయంటున్నారే తప్ప అవి దళారులకు కొమ్ము కాస్తున్నాయన్నారు. సత్వరమే రైతుకు గిట్టుబాటు ధర కల్పించి దళారుల దోపిడీని అరికట్టాలని, లేని పక్షంలో ఆందోళన మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు కడితి సతీష్, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు మడికి సత్యం, కర్నాకుల రామలింగేశ్వరరావు, సత్తిబాబు, బీడీల నాగేశ్వరరావు, వర్దనపు శివాజీ, దాకే నాగరాజు, దాకే సులేమాన్, కొండపూడి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌వుల్లో గేమ్స్ వద్దు!



- కంటి చూపునకు ముప్పంటున్న పెద్దలు
- అవగాహన లేకుంటే జీవితం అంధకారం
- తల్లిదండ్రులూ అప్రమత్తంగా ఉండాలి
- అవుట్‌డోర్ గేమ్స్‌తో శారీరక, మానసిక ఒత్తిళ్లు దూరమవుతాయంటున్న నిపుణులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాలలకు దాదాపు సెలవులు ప్రకటించే సమయం ఆసన్నమైంది. ఇప్పటికే సీబీఎస్ఈ పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు సెలవులు ఇవ్వడంతో సెల్ గేమ్స్‌కు పరిమితం అవుతున్నారు. ఆధునిక ప్రపంచంలో సెల్‌ఫోన్ ప్రాధాన్యం పెరిగినా చిన్నారుల్లో దాని అతి వినియోగం వల్ల కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిలో ప్రధానం కంటి సమస్యలు. ఈ విషయంలో తల్లిదండ్రులు సైతం బాధ్యతగా ఉండాల్సిన అవసరం ఉంది. వారి కాళ్లకు అడ్డం పడకుండా, ఏదో ఒకదానికి వేధించకుండా కుదురుగా ఉంచడానికి ఆ చిన్నారులకు సెల్‌ఫోన్ ఇచ్చేసి ఓ మూల కూర్చోబెడుతున్నారు. కానీ పిల్లల్లో సెల్ ఫోన్ వినియోగం వల్ల వారి కంటిపై పడే ఒత్తిడి వల్ల చిన్న వయసులో వారు కంటి సమస్యల బారిన పడుతున్నారనే విషయం మరచిపోతున్నారు. **సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. ఎందుకంటే మనమంతా ప్రపంచాన్ని చూసే కిటికీ కన్ను. కంటి సమస్యలు విద్యార్థుల్లో సరైన సమయంలో గుర్తించి తగిన చికిత్సను అందిస్తే పెద్ద సమ**స్యల నుంచి కాపాడిన వారమవుతాం.

పిల్లల్లో కంటి సమస్యలు గుర్తించండి ఇలా....

- టీవీ చాలా దగ్గరగా కూర్చుని చూడడం
- పాఠశాలల్లో పక్కన ఉన్న పిల్లల పుస్తకాలు చూసి రాయడం
- చదివేటప్పుడు తల ఒక వైపు తిప్పి, ఒక కంటితో చదవడం
- కళ్లు అస్తమాను చిన్నవి చేయడం
- కళ్లు తరచూ రెప్పలు వేయడం
- తలనొప్పి, తల తిరడగం, ముఖంలో చిరాకు, పుస్తకాలు ముఖానికి దగ్గరగా పెట్టుకుని చదవడం

కంటి సంరక్షణకు ఆహారం

విటమిన్ ఎ, సి, ఇ ఉండే ఆహారం తీసుకోవాలి. ఒమెగా ప్యాటి యాసిడ్స్, క్యారెట్, గోంగూర, విటమిన్ ఎ కలిగిన చేపలు, ఎక్కువగా తీసుకోవాలి. సూర్యకాంతిలో రోజుకు ఒక గంట ఆడించడం చాలా అవసరం. దాని వల్ల పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎంతో ఉల్లాసంగా ఉండి అన్ని విధాలా వృద్ధి చెందుతారు.



విద్యార్థికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



సెల్‌ఫోన్‌తో పిల్లల కాలక్షేపం

అందుబాటులో ఆధునిక చికిత్స



తల్లిదండ్రులు తమ పిల్లలకు కనీసం ఏడాదికి ఒకసారైన కంటి పరీక్షలు చేయించాలి. మూడేళ్ల వయసు నుంచే పరీక్షలు చేయించడం ఉత్తమం. పిల్లల్లో కంటి సమస్యలు గుర్తిస్తే వెంటనే కంటి వైద్యుని సంప్రదించాలి. ఆధునిక చికిత్స విధానంలో విద్యార్థులు, చిన్నారుల్లో సమస్య పెద్దది కాకుండా నిరోధించవచ్చు. అంబ్ల్యోపియాను గుర్తించి చికిత్స చేయకపోతే అది శాశ్వతంగా చూపు కోల్పోవడానికి దారి తీస్తుంది. దీనికి 14 ఏళ్ల లోపు చికిత్స అందించాలి. సాధ్యమైనంత వరకు పిల్లల్లో సెల్ ఫోన్ వినియోగం తగ్గించడం ఉత్తమం.

– ఎండి నవీదుల్ హుస్సేన్, ఆప్టోమెట్రిస్ట్

కంటిపై సెల్ ఫోన్ ప్రభావం...

సెల్ వినియోగం అతిగా ఉండడం వల్ల కళ్లు డ్రైగా మారతాయి. మైనస్ పవర్ పెరిగే అవకాశం ఎక్కువ. చీకటి గదుల్లో సెల్ ఫోన్ చూడడం వల్ల కంటిపై ఒత్తిడి పెరిగి ఎదిగే పిల్లల్లో కంటి సమస్యలు రోజురోజుకు పెరిగే అవకాశాలు ఉన్నాయి.



వీడియో గేమ్ ఆడుతున్న విద్యార్థి



కళ్లు దెబ్బతినేలా..

పిల్లల్లో వచ్చే కంటి సమస్యలు...

మయోపియా: మయోపియా అంటే దూరపు చూపు మందగించడం. ప్రస్తుత కాలంలో 14 సంవత్సరాల లోపు పిల్లల్లో ఈ మయోపియా సమస్య ఎక్కువైందని కంటి వైద్యులు చెబుతున్నారు.

హైపర్ మెట్రోపియా: దీనినే దగ్గర చూపు మందగించడం అంటారు. ఇది పిల్లల్లో ఎక్కువగా కనిపించదు.

యాంబ్లియోపియా: ఒక కన్ను సరిగా ఉండి మరో కన్ను అభివృద్ధి చెందక పోవడం.



మెల్ల కన్ను (స్ట్రాబిస్మస్)తో ఉన్న చిన్నారి

స్ట్రాబిస్మస్: దీనినే మెల్లకన్ను అంటారు. రెండు కళ్ల మధ్య సరియైన సమన్వయం లేకపోవడంతో ఈ సమస్య వస్తుంది.